క్లుప్తంగా

నేడు ఎస్‌యూపురంలో శ్రీవాణిరెడ్డి ప్రచారం

రేణిగుంట: మండలంలోని ఎస్‌యూ పురం గ్రామంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత ఆపరేషన్లకు 24 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరవింద్

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలోని పూజిత బాలికల జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం డైనిమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ హాస్పిటల్ మిషన్ ఫర్ విజన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 65 మందికి డాక్టర్ అరవింద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఉచిత ఆపరేషన్లకు 24 మందిని ఎంపిక చేశారు. చెన్నైలోని శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేస్తామని పీఆర్వో వెంకటమునిి తెలిపారు. యోగగురువు సురేష్‌నాయుడు, డైమినిక్ ఫౌండేషన్ ప్రతినిధులు నాగప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాస్, తేజ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో ఓ ఇంటిలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు కొత్తవీరాపురం గ్రామానికి చెందిన మునెయ్య ఇంటిలో సోదాలు చేయగా పది మద్యం బాటిళ్లను పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: క్రోధి నామసంవత్సరం పురస్కరించుకుని హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన 2024–25 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల, ఎంఈవో శంకరయ్య, సభ్యులు ప్రసాద్, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం,అంజనిప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మహతిలో ఉగాది సంబరాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఉదయం 9.30 గంటలకు మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థవారి వేద పారాయణం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు వేదాంతం విష్ణు భట్టాచార్యులు పంచాగ శ్రవణం చేస్తారు. అనంతరం అష్టావధానం, టీటీడీ ఉద్యోగుల పిల్లలతో తెలుగు వైతాళికుల వేషధారణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం ఉగాది పచ్చడి ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన గోపిక


గోపికను అభినందిస్తున్న ప్రతినిధులు

తిరుపతి తుడా: ఇటీవల ఆగ్రాలో నిర్వహించిన జాతీయ లాక్రోస్ పోటీలలో రాష్ట్రం తరపున తిరుపతి మాధవనగర్‌కు చెందిన చింతమాను గోపిక ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. సందర్భంగా తిరుపతిలోని కుమ్మరుల అభివృద్ధి సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన గోపికను ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమ్మరోళ్ల అభివృద్ధి సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొన్న రవికుమార్ మాట్లాడుతూ లాక్రోస్ పోటీలలో తిరుపతికి చెందిన గోపిక జాతీయస్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన కోరారు. అంతర్జాతీయ లాక్రోస్ పోటీల్లో పాల్గొనేందుకు గోపికకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. సంఘం ప్రతినిధులు పెట్లూరి నరసయ్య, కొమర్ల గురుస్వామి, రెడ్డప్ప, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ధరణికోట లక్ష్మయ్య, చంద్రబాబు, నరేంద్ర పాల్గొన్నారు.

జనం మెచ్చిన పాలన జగనన్నకే సాధ్యం



కొల్లడం గ్రామ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ఓబులరాజు కండ్రిగ ఎస్టీ కాలనీలో ప్రచారం

సత్యవేడు: జనం మెచ్చిన పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కొల్లడం, రాజగోపాలపురం, మోటుపాళెం, పీవీపురం, ఓబులరాజు కండ్రిగ, ఆనందాపురం ఎస్టీ కాలనీ, చమర్తి కండ్రిగ, రేపల్లెవాడ గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత కొల్లడంలో రామచల్లాతమ్మ, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంరతం కొల్లడం దళితవాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న పాలనలో మహిళలకు పెద్ద పీట వేశారని, మహిళలకు పూర్తి స్వేచ్ఛతో పాటు రక్షణ ఏర్పడిందన్నారు. ఎన్నికల వేళ దర్శన మిస్తున్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు ఇన్నాళ్లు ఏమయ్యారని ప్రశ్నించారు. మహిళలను అవహేళన చేస్తూ, వలంటీర్లను కించపరుస్తూ ఏం సాధించారని మండిపడ్డారు. మహిళలకు ఆర్థికాభివృద్ధితో పాటు సమాజంలో గౌరవప్రదమైన పదవులు ఇవ్వడం ఎంతవరకూ ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని, అది ఒక్క సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. మరింత మంచి కోసం రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసినట్లు జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ బూటకపు హామీలతో మోసగించేందుకు కుట్రలు చేస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఏవీ కొనసాగవని పేర్కొన్నారు. కరోనా వంటి కష్ట కాలంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదలను విస్మరించలేదన్నారు. అందుకే జగనన్న వెంట జనం నిలబడుతున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు వలంటీర్లపై కక్షకట్టారన్నారు. పింఛన్ పథకాన్ని అడ్డుకుని అవ్వాతాతల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించిన సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే సత్యవేడు అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న తనను, తిరుపతి పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్న గురుమూర్తిని మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అవకాశమివ్వండి.. అండగా ఉంటా

తనకు ప్రజలు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని నూకతోటి రాజేష్ తెలిపారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ తనను నమ్ముకున్న వారిని ప్రేమించడం తప్ప వంచించడం చేతకాదన్నారు. తాను రాజకీయ కుటుంబం నుంచి వచ్చానని, తన తల్లి కుతూహలమ్మ మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారని, ఆపదలో ఉన్న వారికి సాయం అందించాలనే విషయం నేర్పారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలుకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు. పార్టీ తాడిపత్రి పరిశీలకుడు బీరేంద్ర వర్మ, మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కెవి నిరంజన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె. చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సురుటుపల్లె ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం బుచ్చిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, జిల్లా మహిళా నాయకురాలు మస్తాని, నియోజవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు గోవిందస్వామి, మండల యువత అధ్యక్షుడు వంశీరెడ్డి, వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు కె.శ్యాంప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘుపతిరెడ్డి, పగడాల రమేష్, రమణయ్య, ఎంపీటీసీశెలివ్ర, శేఖర్, ఆనందరెడ్డి, అనంతరాజు, వినోద్, కమల్, కృష్ణమూర్తి, సన్యాసయ్య, రవిరెడ్డి, పరందాం, సురేంద్ర, గోవిందస్వామి, పండయ్య, సుందరయ్య, ఢిల్లీబాబు, పళణి, శ్రీనివాసులురెడ్డి, శరవనన్, కె.బాలయ్య, శంకర్, వెంకటమ్మ పాల్గొన్నారు.

దీన్ని ఏమంటారు..


రోడ్డు పక్కనే ఉన్న పార్కు బోర్డుపై అలాగే ఉన్న ఎన్టీఆర్ పేరు

- వైఎస్సార్ పేరుపై స్టిక్కర్..
- కనిపించేలా ఎన్టీఆర్ పేరు


ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఆరోగ్యకేంద్రం బోర్డుపై వైఎస్సార్ పేరుపై అంటించిన స్టిక్కర్

శ్రీకాళహస్తి: పట్టణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నిబంధనలు సరిగ్గా అమలు కావడంలేదు. ఎక్కడో ఎంపీడీవో కార్యాలయం వెనుక డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం ఉంది. నిబంధనల పేరుతో డాక్టర్ వైఎస్ఆర్ పేరుపై అధికారులు స్టిక్కర్ అంటించారు. శ్రీకాళహస్తి–తిరుపతి ప్రధాన రహదారిపై డాక్టర్ నందమూరి తారక రామారావు ఉద్యానవనం ఉంది. డాక్టర్ నందమూరి తారక రామారావు అన్న పేరుపై ఎలాంటి స్టిక్కర్ అంటించలేదు. ఇదేనా ఎన్నికల నిబంధనల అమలు అంటూ ప్రజలు విస్తుపోతున్నారు. అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్త మవుతునాయి.

రేపు పెంచలకోనలో ఉగాది వేడుకలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 4 గంటలకు మూలమూర్తికి అభిషేకం, 5 గంటలకు పూలంగి సేవ, 9 గంటలకు బంగారు గరుడ వాహనంపై క్షేత్రోత్సవం, 11 గంటలకు పంచాంగ శ్రావణం, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గోనుపల్లిలోని పెనుశిల నరసింహస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

కండలేరులో 7.932 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 7.932 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో బియ్యపు శ్రీవాణిరెడ్డి, బియ్యపు పవిత్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ కుటుంబాలు

ఏర్పేడు: మండలంలోని గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన 30 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ జయముని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో గుండ్లకండ్రిగ గ్రామ టీడీపీకి చెందిన చలపతి యాదవ్, వెంకటేష్ యాదవ్, శేఖర్ యాదవ్, వెంకటరత్నం యాదవ్, ఎస్.శీను, పి.శీను, షేక్‌హుస్సేన్, హనీఫ్, మునిరెడ్డి తదితర 30 మందికి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూ దన్ రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

రాజులకండ్రిగ టీడీపీ కుటుంబాలు

మడిబాక పంచాయతీ రాజులకండ్రిగకు టీడీపీకి చెందిన 15 కుటుంబాల కార్యకర్తలు, మహిళలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ చెంగల్‌రాజు ఆధ్వర్యంలో లతమ్మ, రాజేశ్వరమ్మ, అంకమ్మ, సుబ్బమ్మ, మంగమ్మ, లక్ష్మి, వెంకటమ్మ, మాదవి, బత్తెమ్మ, నామణి, సుమతి, రాజేంద్ర రాజు, శంకర్ రాజు, వెంకటాచలం రాజుతో పాటు మరో 15 కుటుంబాల కార్యకర్తలు, మహిళలకు శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మధురాజు, రాంబత్తెయ్య యాదవ్, జనార్దన్ రాజు, గోపీ యాదవ్, రాజా, మణి రాజు, చలం రాజు, భాస్కర్ రాజు అత్తల్ రాజా పాల్గొన్నారు.

రచయితల సంఘం ఉగాది కవి సమ్మేళనం


మాట్లాడుతున్న మన్నవ గంగాధర్ ప్రసాద్

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం యూత్ హాస్టల్లో ఉగాది కవి సమ్మేళనం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిధిలోని 40 మంది కవులు తమ స్వీయ కవితలను వినిపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితీ వేత్త సాకం నాగరాజు, విశిష్ట అతిథిగా డాక్టర్ వి.కృష్ణవేణి, ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు, మన్నవ గంగాధర ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. శతావధాని ఆముదాల మురళి కవితలపై సమీక్ష చేశారు. కవులు మాలేపట్టు పురుషోత్తమాచారి, సురేంద్ర రొద్ద, ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, సుభద్ర, కడివేటి మునిరత్నం, మునస్వామి, వారణాసి వెంకటసుబ్రమణ్యం, షాజహాన్, సూర్యప్రకాష్, యామిని, మన్నవ గంగాధర ప్రసాద్, కలువగుంట రామమూర్తి, మురళీధర్‌రాజు, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, నడ్డినారాయణ, కొఠారి వెంకటరత్నం, శాంతకుమారి, గోపాల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం సుసంపన్నం

తిరుపతి కల్చరల్: భారతీయ భాషల్లో తెలుగు సాహిత్యం సుసంపన్నమైందని, మన పూర్వీకులు అందించిన ఈ సాహిత్య సంపదను భావితరాలకు అందించాని ప్రముఖ సాహిత్యకారుడు ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి తెలిపారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉగాది కథల పోటీల బహుమతి ప్రదాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రధాన వక్త, సాహితీ విమర్శకుడు ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రథమ బహుమతి గూటికి చేరిన పక్షులు కథ రాసిన లక్ష్మీ గాయత్రి, ద్వితీయ బహుమతి డాక్టర్ ఎం.సుగుణరావు, తృతీయ బహుమతిగా నీలకంఠంకు 5, 4, 3 వేల రూపాయలు చొప్పున బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పది మంది కవుల కథలకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి, టెంకాలయ దామోదరం, సాకం నాగరాజు, తమటం రామచంద్రారెడ్డి, ఆర్‌వీ సురేష్‌కుమార్, నసీమ్, కృష్ణవేణి, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, సుభద్ర, పేరూరు బాలసుబ్రమణ్యం, ముంగర శశిధర్‌రాజు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


భరత నాట్యం, జానపద నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం, జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి సంస్థకు చెందిన కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా వివిధ పాటలకు కళాకారులు మస్తాన్, గగన, లహరి, భరత్, అక్షిత, జీవిత, చిత్ర, వర్షిత, మధుశ్రీ, పావని, మమత, సారీష్, అనూప్, రేయాన్, మహీధర్, ఈక్షిత్, చందు, సీతూ, భానుశ్రీ, గోపి, దాము నాగరాజుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యం ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులతోపాటు డ్యాన్స్ మాస్టర్ రాజేష్ బాబులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా గరికపాటి


గరికపాటి చంద్రశేఖర్, పుట్టంరాజుకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా రామచంద్ర కూల్‌డ్రింక్స్ అధినేత గరికపాటి చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శిగా పుట్టంరాజును నియమిస్తూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ కార్యాలంలో నియామకపత్రాలను అందజేశారు. ప్రముఖ సంఘ సేవకుడు రామచంద్ర కూల్‌డ్రింక్స్ వ్యవస్థాపకుడు గరికపాటి రామచంద్రయ్య తనయుడు చంద్రశేఖర్ సుమారు 200మంది అనుచరులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన విషయం తెలిసిందే. పట్టణ ఉపాధ్యక్షుడిగా నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసంతో పార్టీ పదివిలో నియమించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బియ్యపు మధుసూదన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిచేలా పని చేస్తానని తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మిద్దెల హరి, పార్టీ పట్టణాధ్యక్షుడు పగడాల రాజు, నాయకులు కంఠా ఉదయ్, సి.జయగోపాల్, యు.శరవణకుమార్, నాగరాజు, సెన్నీరు కుప్పం శేఖర్, వెంకటేష్‌బాబు, కొట్టే సురేష్, చింతామణి పాండు, అస్లాం, సాగీరాబి, షర్మిల టాగూర్, అమర్, పూడి రవి, కార్తికేయన్ వేదగిరిపత్తి పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డితోనే శ్రీకాళహస్తి అభివృద్ధి


ఇంటింటి ప్రచారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి చెందిందని, మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తారని ఎమ్మెల్సీ, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని 33వ వార్డు ప్రాజెక్టు వీధిలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా లేని అభివృద్ధి కేవలం ఈ ఐదేళ్లలో మధుసూదన్‌రెడ్డి చొరవతో జరిగిందన్నారు. గత టీడీపీ పాలన, ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనను బేరీజు వేసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రత్నంరెడ్డి, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, స్వామిరెడ్డి భరత్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పాండురంగస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పిచ్చాటూరు: పట్టణంలోని శ్రీధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి శ్రీపాండురంగ స్వామి, రుక్మిణీదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలంకరణలు, అరటి తోరణాలు, రంగవల్లులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేదికపై శ్రీపాండురంగ స్వామి, విఠోభాయి దంపతుల చిత్రపటాన్ని కొలుదీర్చి అందంగా ముస్తాబు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం చిన్నారుల పండరిభజన గజ్జ పూజ ఆదివారం వేకువజామున 4 గంటల వరకు భక్తిప్రపత్తులతో జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తజనం తరలి వచ్చారు. పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులకు పండరి భజన దుస్తులను గ్రామ యువకులు వితరణగా అందజేశారు. పండరి భజన నేర్పిన మాస్టర్‌లు లోకేష్, శివకుమార్, తులసి, శ్రీవాణిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

● జోరుగా వేరుశనగ ఒబ్బిళ్లు


వేరుశనగ పంటను పెరుకుతున్న రైతులు


వేరుశనగ కాయలను ఆరబోస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో వేరుశెనగ రైతులు పంట ఓబ్బిళ్లును జోరుగా సాగిస్తున్నారు. మండలంలో రబీ సీజన్‌లో సుమారు 2 వేల ఎకరాల్లో పంటను సాగు చేశారు. వర్షాలు అంతంత మాత్రంగానే పడినా కే6 రకంను మెట్ట భూముల్లో బోర్లు, బావుల వద్ద సాగు చేశారు. మంచు ఎక్కువగా కురవడంతో తెగ్గుళ్లు సోకినా దిగుబడి బాగానే వచ్చింది. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తోంది. 40 కేజీల బస్తా కాయల ధర రూ. 2,500పైగా పలుకుతోంది. దీంతో ఎకరాకు అన్ని ఖర్చులు పోనూ రూ.30 వేల ఆదాయం వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బుచ్చినాయుడుకండ్రిగ

● ముందే వచ్చిన రంజాన్..



రంజాన్ అనగానే గుర్తుకు వచ్చేది ఉపవాసం, ఇఫ్తార్. శ్రీకాళహస్తిలో ఆదివారం రాత్రి మహేష్ కల్యాణ సదన్‌లో ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంను ముస్లిం మైనారిటీ నాయకులు ఆహ్వానించారు. ముస్లింలు కుటుంబ సభ్యులతో పాల్గొనడంతో సందడి నెలకొంది. రంజాన్ పర్వదినం ముందే వచ్చిందా అన్నట్లు కనిపించింది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు విందు ఆస్వాదించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పండుగలు ప్రజల నడుమ శాంతి, సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తాయన్నారు.

–శ్రీకాళహస్తి


